క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు: పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలను తొలగిస్తుండడంతో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, సాయంత్ర 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని సూచించారు.

చేపలకు భలే గిరాకీ



మరికల్: మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం మరికల్‌లో చేపల మార్కెట్ కళకళలాడింది. మృగశిర కార్తె ప్రారంభం కాగానే మొదటి రోజు నుంచే రుతుపవనాల రాకతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. వాతావరణ చల్లబడడంతో చేపలను తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని పెద్దల నమ్మకం. దీంతో చేపలను కొనేందుకు జనాలు ఎగబడ్డారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు చేయాలి




మాగనూర్: మండల పరిధిలో వడ్వాట్ గ్రామంలోని వడ్వాట్–అడవిసత్యారం ప్రధాన బీటీ రహదారి మధ్యలో తాగునీటి పైపులైన్ పగిలిపోయి తాగునీరు వృథాగా పోతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భారీ ట్రిప్పర్లు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుండడంతో పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా లీకేజీ అవుతుంది. వర్షాకాలం కావడంతో ఇప్పటికే ఇళ్ల మధ్య బురదగా మారుతుండగా ఇప్పుడు తాగునీటి పైపులైన్ కూడా పగిలిపోవడంతో మరింత ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

రెనివట్లలో తాగునీటి ఎద్దడి



మద్దూరు: మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల గ్రామంలోని కృష్ణదేవాలయం నుంచి రగ్‌కటే సాబ్ దర్గ వరకు ఉన్న కాలనీలో నీటి కష్టాలు మొదలయ్యాయి. రెండు నెలల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. గ్రామంలో బీటీ రోడ్డు పనుల వల్ల తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో ఈ సమస్య వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. రోజు విడిచి రోజు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అవి ఏ మాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో పైప్‌లైన్ పనులు పూర్తి చేసి తాగునీటిని అందిస్తామని తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మద్దూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సవిత సూచించారు. పాఠశాల ఆవరణలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడల్లో దాదాపు 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం పాఠశాల అవరణలో శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయండి

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరి గతంలో ఇచ్చిన హామీ అమలు చేయలేదని, ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన వెంటనే కాలేజీ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వినయ్, రాము, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

నర్వ: ముదిరాజ్ బిడ్డను మంత్రిని చేసి సీఎం రేవంత్ రెడ్డి మాటను నిలబెట్టుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ అన్నారు. ఆదివారం రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ తమ నాయకుడికి మంత్రిగా అవకాశమిచ్చినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్యసాగర్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, శరణప్ప, అశోక్‌గౌడ్, రాజారెడ్డి పాల్గొన్నారు.

మాగనూర్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఖరారు కావడంతో మాగనూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పేదలకు అండగా నిలవడంతో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడంతో ముందుంటారని మంత్రి వాకిటి శ్రీహరి సేవలను కొనియాడారు.

మక్తల్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి కేటాయించడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1997లో మక్తల్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున గెలుపొందిన ఎల్లారెడ్డి ఉమ్మడి ఏపీలో మొదటి సారి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మళ్లీ 28 ఏళ్ల తర్వాత మక్తల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచినా వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వరించడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

ఊట్కూరు: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో చోటు దక్కడంపై ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు టపాకాయలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో యజ్ఞేశ్వర్ రెడ్డి, కోరం మహేష్, లింగం, కత్తలప్ప, మోహన్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నారాయణపేట: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకొని సంబ రాలు జరుపుకున్నారు. నారాయణపేట జిల్లా నుంచి శ్రీహరికి మంత్రి పదవి కేటాయించడం వల్ల జిల్లా అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



మంత్రి వాకిటి శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మక్తల్: రాష్ట్ర మంత్రిగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రిగా ఆదివారం రాజ్ భవన్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నియోజకవర్గంలో స్థానిక నాయకులు బాణా సంచా కాల్చి, స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కొందరు కార్యకర్తలు నేరుగా హైదరాబాద్‌కు వెళ్లి మంత్రి వాకిటి శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్ కుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉద్యమనాయకుడు నీలప్ప, ఆంజనేయులు, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: ముదిరాజ్ సంఘం నాయకుడు, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడం పట్ల కాన్‌కుర్తి గ్రామంలో ముదిరాజ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో మాజీ ఎంపీటీసీ బస్వరాజ్ సమక్షంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. తమ నాయకుడికి మంత్రి పదవి కేటాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, బసిరెడ్డి, ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

ధన్వాడ: ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరికి మంత్రి వర్గంలో చోటు కల్పించడంతో ధన్వాడ మండల కేంద్రంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అనంతరం బాణాసంచా కాల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు.



మార్కెట్ యార్డు చైర్మన్‌కు స్వీట్లు తినిపిస్తున్న నాయకులు



వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో కాన్‌కుర్తిలో నాయకుల సంబరాలు

‘పార్టీలకతీతంగా యాదవులంతా ఏకమవుదాం’

కోస్గి: రాజకీయాలు పక్కనబెట్టి పార్టీలకతీతంగా యాదవ కులస్తులంతా ఏకమైతేనే అభివృద్ధి సాధిస్తామని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుర్రం హన్మంతు యాదవ్ సూచించారు. ఆదివారం గుండుమాల్ యాదవ హక్కుల పోరాట సమితి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి హన్మంతు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో యాదవ కులస్తులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు నూతనంగా ఎన్నికైన కమిటీల ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవ కులస్తులు పెద్ద ఎత్తున పోటీ చేసి సత్తా చాటాలని సూచించారు. అనంతరం గుండుమాల్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రఘు, ఉపాధ్యాక్షుడిగా కృష్ణయ్య, వెంకటయ్యతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం గుండుమాల్ అధ్యక్షుడు వెంకట్ రాములు, కార్యదర్శి కృష్ణయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు అమృత్ యాదవ్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో సంఘం నాయకులు

కాకర్లను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

నారాయణపేట రూరల్: ఇటీవల డాక్టరేట్ అందుకున్న అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నాయకులు కాకర్ల భీమయ్యను ఆదివారం ఆయన నివాసంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. అతి తక్కువ కాలంలోనే ఆయన చేసిన సేవలను గుర్తించి తమిళనాడు లోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గుర్తించి డాక్టరేట్‌ను అందించడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నారాయణమ్మ, నాయకులు విద్యాసాగర్, ప్రసాద్ గౌడ్, నారాయణ, వెంకటయ్య, రామ్ రెడ్డి పాల్గొన్నారు.



కాకర్లను శాలువాతో సన్మానిస్తున్న ఎర్రశేఖర్

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన

మక్తల్: పట్టణంలోని యాదవనగర్‌లో కొలువైన వేణుగోపాల స్వామి ఆలయం పునఃప్రారంభంతో పాటు ఆలయంలో గణపతి, గరుత్మంతుడు, ధ్వజ స్తంభం శ్రీకృష్ణుడి విగ్రహాల ప్రతిష్ఠానోత్సవం కార్యక్రమం కనుల పండువగా జరిగింది. హంపి పీఠాధిపతి శ్రీ విద్యాహరణ్య భారతిస్వామి చేతుల మీదుగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం వాకిటి శ్రీహరి దంపతులను హంపి పీఠాధిపతి ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి కూడా పూజల్లో పాల్గొనగా ఆయనను శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో బిజ్వార్ మఠాధిపతి పరాశ్రీస్వామి, బీకేఆర్ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నర్సింహ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి వాకిటి శ్రీహరి దంపతులను ఆశీర్వదిస్తున్న హంపి పీఠాధిపతి

మొక్కలు నాటి సంరక్షించాలి

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఆదివారం సపోటా మొక్కను నాటి మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు ఒక చెట్టు తల్లికి అర్పణగా ప్రతీ కార్యకర్త తమ ఇంటి ఆవరణలో మొక్క నాటాలని సూచించారు. ప్రజలందరూ మొక్కలు పెంచడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ ఇంటికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో రతంగపాండురెడ్డి, శ్రీనివాసులు, రఘు రామయ్య గౌడ్, వినోద్ పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయం ఆవరణలో మొక్క నాటుతున్న శాంతికుమార్

భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యుల పరామర్శ

దామరగిద్ద: మండలంలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన బాలప్ప కుటుంబానికి భీష్మరాజ్ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలం కంసాన్‌పల్లి గ్రామంలో షుగర్ వ్యాధితో రెండు కాళ్లను కోల్పోయి మంచానికే పరిమితమైన బాలప్ప ను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. ఫౌండేషన్ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహా నాయుడు, సంతోష్, శివరాజ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణపేట రూరల్: ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు క్యాంపు కార్యాలయంలో తెలంగాణ మేధావుల సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు, విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1గంటకు శీల గార్డెన్‌లో నారాయణపేట మండల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించి, సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు దామరగిద్ద మండలం మల్‌రెడ్డి పల్లి గ్రామంలో ఇన్సూరెన్స్‌పై రైతులకు అవగాహన కల్పించి, ఇటీవల మరణించిన రైతు కుటుంబానికి రూ.5.10 లక్షల బీమా చెక్కు పంపిణీ అలాగే పలు గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు.

ఘనంగా లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు గ్రామంలో మైలార్ లింగేశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులతో కలిసి జల్దిబిందెను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి అభిషేకం, నవగ్రహ పూజ, హోమం, కల్యాణం జరిపించారు. అనంతరం మహా మంగళహారతి నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొత్తూరు జయమ్మ బాల్‌రెడ్డి, కొత్తూరు సంజీవరెడ్డి, మల్లేశ్ యాదవ్, సత్యయాదవ్, శివారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన



నారాయణపేట రూరల్: మండలంలోని పేరపళ్ల గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నిర్మాణ పనులను భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. గ్రామానికి తీసుకొచ్చిన విగ్రహాన్ని పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. తాను విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ నాయకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్వ: మండలంలోని ఉన్నత పాఠశాల 2000–01 లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, సత్యనారాయణ, చెన్నయ్య, నారాయణమూర్తి, నరేందర్‌ను శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చందు, చంద్ర య్య, సురేష్, రాకేష్, క్రిష్ణ, అయ్యపురెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతోనే అభివృద్ధి సాధ్యం

కొత్తపల్లి: అభివృద్ధిలో గ్రామీణ రోడ్లు కీలకపాత్ర పోషిస్తాయని డీఈ విలోక్ అన్నారు. మండల పరిధిలోని మన్నాపూర్ గ్రామం నుంచి వీరారం వరకు బీటీ రోడ్డు ఏర్పాటుకు రూ.3.39 కోట్లు మంజూరు కాగా ఏఈ అంజిరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు బాగుంటే రవాణా వ్యవస్థ మెరుగు పడి అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజక వర్గంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణ రోడ్లకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేశ్ రెడ్డ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోట్ల మహేందర్ రెడ్డి, చన్నప్ప, శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



సీపూర్‌లో ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు



బడిబాటలో భాగంగా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోస్గి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం సూచించారు. ఈ మేరకు ఆదివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని మాసాయపల్లి, కడంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులుంటారని, ప్రైవేట్‌తో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్ రావు, శ్రీనివాస్, రాజశేఖర్, గీతారాణి పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఎస్ఓ భాను ప్రకాష్ అన్నారు. మండలంలోని జాజాపూర్, కోటకొండ గ్రామాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. అదే విధంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యా బోధన, సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు.

నర్వ: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్య అందిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సీపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో ఉచిత యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చెప్పిస్తున్నట్లు తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు గోపాల్, వెంకటేశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఊట్కూరు: పెద్దజట్రం గ్రామంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయులు ‘బడిబాట’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మప్ప, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కెంచె గోపాల్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలప్ప, వెంకటప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏళ్లుగా భర్తీకి నోచుకోని పోస్టులు



ఎంపీడీవో కార్యాలయంలోనే కొనసాగుతున్న ఎమ్మార్సీ కార్యాలయం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులు
- త్వరగా భర్తీ చేయాలని వేడుకోలు

కృష్ణా: మండలంలోని విద్యా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం పదేళ్లుగా భర్తీ చేయకపోవడంతో మండలంలోని ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఐఎస్, కంప్యూటర్ ఆపరేటర్, ఐఈడీ ఉపాధ్యాయుడు, మెసెంజర్, రెండు సీఆర్‌పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కృష్ణా మండలంలో మొత్తం నాలుగు ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా, నాలుగు యూపీఎస్, 13 ఎంపీఎస్ పాఠశాలలు ఉన్నాయి. కాగా ఈ పాఠశాలలకు సంబంధించిన మధ్యాహ్న భోజనం వివరాలు, విద్యార్థుల పరీక్షల రిపోర్టులను సేకరించి వాటిని రోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దాంతో పాటు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. అలాగే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి. దీంతో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మార్సీ కార్యాలయంలో ఉంటూ అన్ని పాఠశాలల రిపోర్టులను తయారు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎమ్మార్సీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్న ఉపాధ్యాయులతోనే పనులు చేపించుకోవడంతో ఒత్తిడి పెరిగి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై మండల ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా చర్యలు మాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కరే చూసుకోవాల్సి వస్తుంది



మండలంలోని 5 ఉన్నత, 13 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత పాఠశాలలను ఒక్క సీఆర్‌పీనే చూసుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రతి రోజు అన్ని పాఠశాలలకు సంబంధించిన విషయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అదే మండలంలో ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేస్తే ఈ ఇబ్బందులు తీరుతాయి.

– అమీన్, సీఆర్పీ, కృష్ణ మండలం

డీఈఓల బదిలీలతోనే ఆలస్యం



మండల కేంద్రంలోని విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీఈఓకు పలుమార్లు విన్నవించాం. త్వరలోనే భర్తీ చేస్తామని ఉన్న తాధికారులు కూడా తెలిపారు. అయితే జిల్లాకు వచ్చిన డీఈఓలు ఆరు నెలల్లోపే బదిలీలు అవుతుండడంతో ఖాళీల భర్తీ ఆలస్యమవుతుంది.

– నిజాముద్దీన్, ఎంఈఓ, కృష్ణ మండలం